www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 25 ఫిబ్రవరి 2023
5
ఏలూరు

డిఎంహెచ్ఒగా ఆశ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు

డిఎంహెచ్ఒగా డాక్టర్ డి.ఆశ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ ఇక్కడ డిఎంహెచ్ఒగా పనిచేసిన డాక్టర్ ఎం.నాగేశ్వరావు నుండి ఆమె బాధ్యత స్వీకరించారు. నూజివీడు డిప్యూటీ డిఎంహెచ్ఒగా పనిచేస్తున్న ఆశా డిఎంహెచ్ఒగా బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆమె కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కలెక్టర్‌కు మొక్కను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సత్వరం మెరుగైన వైద్యసేవలందించే దిశగా వైద్య ఆరోగ్యశాఖ పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా వైద్య సేవలను మరింత విస్తృతంగా క్షేత్రస్థాయిలో ప్రజలకు అందే విధంగా కృషి చేయాలని సూచించారు.

బడ్జెట్‌లో పేదలకు ఒరిగింది శూన్యం

సిపిఎం ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

కేంద్ర బడ్జెట్ వల్ల పేదలకు ఒరిగింది శూన్యమని, అలాగే ఆదానీ కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపి బ్యాంకుల నుండి తీసుకున్న లక్షల కోట్ల రూపాయలు తిరిగి కట్టించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ తెలిపారు. శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో ఆదానీ కుంభకోణాలపై సమగ్ర విచారణ కోరుతూ స్థానిక ఏలూరు రోడ్‌లోని సిపిఎం కార్యాలయం ఎదురుగా ప్లకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ భారతదేశంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత బడా పెట్టుబడిదారులకు, కార్పొరేట్ సంస్థలకు దాసోహమై దేశ సంపదను దోచి పెడుతున్నారన్నారు. అదే కోవకు చెందిన ఆదానీ భారతదేశంలోని అత్యంత సంపన్నుడిగా ఎదిగిన వైనాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. 2002లో మోడీ గుజరాత్ ముఖ్యమంత్రి అయినప్పుడు ఆదానీ మోడీ మధ్య సంబంధాలు మొదలయ్యాయని, ఆ సంబంధాలతో దేశవ్యాప్తంగా ప్రభుత్వరంగ

జంగారెడ్డిగూడెంలో..

సంస్థలను, దేశ సంపదను దాసోహం చేస్తున్నారన్నారు. ఇప్పటికే ఆదాని గుప్పెట్లో ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, బ్యాంకుల నుంచి తీసుకున్న రూ.వేలకోట్ల రుణాలను తిరిగి కట్టించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరంతరం దేశభక్తితో మాట్లాడుతున్న మోడీషా ఈ దేశ ప్రజలపై పెనుభారాలు మోపుతూ దేశ సంపదను కొంతమందికి దోచిపెట్టడం, దేశభక్తా అని ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్లో ఉపాధి హామీ చట్టానికి, రైతులకు, పోలవరం ప్రాజెక్టుకు నిధుల ఊసే లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు టి.దుర్గారావు, టి.నాగమణి, జి.వెంకట్రావు, టి.సత్యనారాయణ, ఎం.జీవరత్నం, బి.రాంబాబు, పసల సూర్యారావు, ఎస్‌కె.సుభాషిని, కె.భాస్కర్, జి.సూర్యకిరణ్ పాల్గొన్నారు.

ఏలూరు: కేంద్ర బడ్జెట్ ప్రజావ్యతిరేక బడ్జెట్ అని,

ఏలూరులో..

అలాగే కేంద్ర ప్రభుత్వం అదానీ కుంభకోణాలపై సమగ్ర దర్యాప్తు జరిపి, ఆయన చేతిలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను వెనక్కి తీసుకుని ఆస్తులు జప్తు చేయాలని సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పళ్లెం కిషోర్ డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఏలూరు పాతబస్టాండ్ సెంటర్‌లో పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పి.కిషోర్ మాట్లాడుతూ హిండెన్ బర్గ్ సంస్థ అదానీ అవినీతి, అక్రమాల కుంభకోణం వెలుగులోకి తీసుకొచ్చిందన్నారు. అదానీ కుంభకోణం వల్ల షేర్ మార్కెట్‌లో రూ.5.60 లక్షల కోట్లు ఆవిరైపోయాయన్నారు. మధ్యతరగతి మదుపరులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. గుజరాత్ రాష్ట్రంలో వజ్రాలవ్యాపారిగా అదానీ ఉండేవాడని, గుజరాత్ గోద్రా అల్లర్లతో అప్పటి ముఖ్యమంత్రి మోడీకి ఇబ్బందులు వస్తున్న తరుణంలో అదానీ పెట్టుబడిదారులను కూడగట్టి ఎన్నికల్లో మోడీకి మద్దతుగా నిలిచారన్నారు. దానికి మోడీ కృతజ్ఞతగా అదానీ డొల్ల కంపెనీలకు ప్రభుత్వాల నుండి రాయితీలు ఇప్పించడం మొదలు పెట్టారని విమర్శించారు. ముఖ్యమంత్రి నుండి నేడు ప్రధాని అయిన వరకూ మోడీ గౌతమ్ అదానీకి చెందిన కంపెనీలకు ప్రభుత్వ రాయితీలు అందిస్తూనే ఉన్నారన్నారు. అదానీ సంస్థలకు బ్యాంకులు రుణాలు మంజూరు చేయించడం, అదానీకి ప్రభుత్వ రంగసంస్థలు కట్టబెట్టడం వల్ల ఆయన నేడు ప్రపంచ కుబేరుల జాబితాలో రెండవ స్థానంలో ఎగ బకారూ అన్నారు. మోడీ ప్రధాని కాక ముందు గౌతమ్ అదానీ ఆస్తుల విలువ రూ.50 వేల కోట్లు ఉంటే, నేడు రూ.10.60 లక్షల కోట్లకు పెరిగిందంటే మోడీ ప్రభుత్వం ప్రజాసంపదను ఎలా దోచిపెట్టిందో ఆలోచించవచ్చన్నారు. దేశంలో విమానాశ్రయాలు మొదలుకొని విద్యుత్ సంస్థలు, బొగ్గు గనులు, పోర్టులు, ఓడ రేవుల వరకూ ప్రభుత్వ సంస్థలను అదానీకి కట్టబెడుతున్నారని విమర్శించారు. అదానీ లేని కంపెనీలు ఉన్నట్లు చూపించి, షేర్ మార్కెట్లో ఎలా మాయాజాలం చేశారో హిండెన్ బర్గ్ నివేదిక స్పష్టం చేసిందన్నారు. అదానీ సంస్థలకు బ్యాంకు రుణాలు ఇవ్వడం వల్ల మొండి బాకీలు పెరిగి, బ్యాంకులు దివాళా తీస్తున్నాయన్నారు. ఈ ధర్నాలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పివి.రామకృష్ణ, నగర నాయకులు వి.సాయిబాబు, బి.జగన్నాధరావు, వివివిఎన్.ప్రసాద్, జె.గోపి, మావూరి శ్రీనివాసరావు, జి.యేసుబాబు, కోటేశ్వరరావు, ఎస్.సత్యనారాయణ, ఎం.సత్యనారాయణ, చల్లా పైడియ్య, నరసింహమూర్తి, బ్రహ్మం, సీతయ్య పాల్గొన్నారు.

నూజివీడు : కేంద్ర బడ్జెట్‌కి వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో నూజివీడు చిన్న గాంధీ బొమ్మ సెంటర్లో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఎన్ఆర్.హనుమాన్, నాయకులు మరియదాస్, పద్మాంజలి, రామకృష్ణ, వసంతరావు, శ్రీనివాసరావు, ఏసుదాస్, మనోహర్ పాల్గొన్నారు.

నూజివీడులో..

ఆక్వాకు రూ.1.50కే విద్యుత్

రైతులను అన్నివిధాలా ఆదుకుంటాం
కార్పొరేషన్ రుణాల ఎత్తివేతతో బిసి, ఎస్‌సిలకు వైసిపి అన్యాయం
పోలవరంను సర్వనాశనం చేశారు
కార్యకర్తలే పార్టీకి సైన్యం, బలం
వచ్చే ఎన్నికల్లో నూటికి వెయ్యిశాతం గెలుపు మనదే
జోన్-2 నాయకులు, కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు


మాట్లాడుతున్న చంద్రబాబు


హాజరైన పార్టీ నేతలు, కార్యకర్తలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అధికారంలోకొచ్చాక ఆక్వా సాగుకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే ఇచ్చి ఆదుకుంటామని టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు తెలిపారు. ఉభయగోదావరి జిల్లాల జోన్-2 పరిధిలోని క్లస్టర్, యూనిట్, బూత్ లెవెల్, మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశం శుక్రవారం ఏలూరు బైపాస్‌రోడ్డులో నిర్వహించారు. సమావేశానికి రెండు జిల్లాల నుంచి దాదాపు మూడు వేల మంది వరకూ హాజరయ్యారు. వచ్చే ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు ఏవిధంగా వ్యవహరించాలనే దానిపై కార్యకర్తలు, నాయకులకు శిక్షణ ఇచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఓటర్ల జాబితా పరిశీలన, చనిపోయిన వారి ఓట్ల తొలగింపు, ఒకరికే రెండు ఓట్లు ఉండటం, నియోజకర్గంలో లేని వారి ఓట్లు గుర్తించి ఏం చర్యలు తీసుకోవాలో వివరించారు. పోలీసు కేసులను ఏవిధంగా ఎదుర్కోవాలి, పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై ఫొటోలు ఏవిధంగా తీసి పంపాలి, లీగల్ సెల్‌తో ఏవిధంగా సంప్రదించాలో తెలిపారు. సంక్షేమ పథకాల్లో ప్రభుత్వం ఏవిధంగా కోతలు పెడుతుందో, జనాలకు ఏవిధంగా నష్టం చేకూరుస్తుందో ప్రజలకు ఎలా వివరించాలో శిక్షణ ఇచ్చారు. యూనిట్ పరిధిలో ఉండే దాదాపు 1200 ఇళ్లకు సంబంధించి రోజుకు 40 ఇళ్లను కలవాలన్నారు. యూనిట్, క్లస్టర్, బూత్‌లెవెల్, కొత్తగా నియమిస్తున్న కుటుంబ సారధులంతా జనంలో ఉండి ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలన్నారు. అదే సమయంలో టిడిపి హాయాంలో అమలు చేసిన సంక్షేమం గురించి ప్రజలకు తెలియజెప్పాలో వివరించారు.

కార్యకర్తలే పార్టీకి వెన్నెముక: చంద్రబాబు

టిడిపికి కార్యకర్తలే వెన్నెముక అని చంద్రబాబు అన్నారు. మధ్యాహ్నం మూడున్నర గంటలకు శుక్రవారం ఏలూరు జరిగిన జోన్-2 సమావేశంలో పాల్గొన్న ఆయన పలు అంశాలపై మాట్లాడారు. ఆక్వాసాగుకు యూనిట్‌కు రూ.రెండుకే ఇస్తామని, ఇప్పుడు జోన్, నాన్ ఆక్వాజోన్ పేరుతో రూ.4.50 చేశారన్నారు. టిడిపి అధికారంలో కొచ్చాక ఆక్వాకు యూనిట్‌కు రూపాయిన్నరకే విద్యుత్ ఇస్తామన్నారు. మూడు, నాలుగు నెలలకు కూడా ధాన్యం డబ్బు వేయడం లేదని, అధికారంలోకొచ్చాక రైతులను అన్నివిధాలా ఆదుకుంటామన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను మీరు జనాలకు చెప్పగలిగితే వైసిపికి డిపాజిట్లు కూడా రావన్నారు. నూటికి వెయ్యిశాతం వచ్చే ఎన్నికల్లో టిడిపినే గెలుస్తుందన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలన్నారు. ఓటర్ల జాబితా అవకతవకలపై కేంద్రం, ఎన్నికల సంఘం, కోర్టుకు వెళ్లదామని తెలిపారు. వెను కబడిన తరగతులకు టిడిపి అండగా ఉంటుందని, అజెండా, మేనిఫెస్టో అదే ఉంటుందన్నారు. ఎస్‌సిలకు సంబంధించి 27 పథకాలను రద్దు చేశారన్నారు. కార్పొరేషన్ రుణాలు ఇవ్వకుండా ఆపేశారన్నారు. టిడ్కో ఇళ్లు ఇవ్వకుండా లబ్ధిదారులను ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. 72 శాతం పూర్తి చేసిన పోలవరంను సర్వనాశనం చేశారన్నారు. ఒకొక్కరిపై రెండు లక్షల అప్పు ఉందన్నారు. వైసిపిపై జనాల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. జనంలో ఉన్నవారికే ఎంఎల్ఎ టిక్కెట్ ఇస్తామని, ఆవిధంగా చేద్దామా అంటూ కార్యకర్తలను చేతులెత్తి చెప్పాలనడంతో అంతా చేతులెత్తారు. ఇసుక, మైనింగ్ మాఫియా గురించి ప్రజలకు వివరించాలన్నారు. సంక్షేమం పేరుతో రూ.పది వేలు ఇచ్చి రూ.లక్ష లాగేస్తున్నారని తెలిపారు. మద్యం ముసుగులో పెద్దఎత్తున దందా నడుస్తుందన్నారు. నిత్యావసరాల ధరలు పెరిగిపోయాయన్నారు. టెక్నాలజీలో చాట్‌జిపిటిని ఉపయోగించాలన్నారు. వివేకా హత్య కేసులో టెక్నాలజీతో సిబిఐ జగన్ బండారం బయట పెడుతుందని తెలిపారు. పని చేసిన వారికే పార్టీ అధికారంలోకొచ్చాక పదవులు ఇస్తామన్నారు. ప్రభుత్వం జిఓ-1 తెచ్చి సమావేశాలు, సభలను అడ్డుకుంటుందన్నారు. నాయకులు, కార్యకర్తలతో పలు అంశాలపై మాట్లాడించారు. కార్యక్రమంలో ప్రస్తుత ఎంఎల్‌ఎలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడికి ఖండన

ప్రజాశక్తి - భీమడోలు

హైదరాబాద్ ఎల్‌బినగర్‌కు చెందిన న్యాయవాది ఎ.సురేంద్రపై దాడిని భీమడోలు బార్ అసోసియేషన్ ఖండించింది. ఈ మేరకు భీమడోలు కోర్టు వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. కోర్టు విధులను బహిష్కరించారు. భీమడోలు బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.విజయరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ మాజీకార్యవర్గ సభ్యులు రాజారావు మాట్లాడుతూ కక్షిదారులకు న్యాయం చేయడం న్యాయవాదుల కర్తవ్యమన్నారు. అలాంటి న్యాయవాదిపై దాడిచేసిన వారిని శిక్షించాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి : డిఇఒ

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థితో మాట్లాడుతున్న డిఇఒ

విద్యార్థులకు నాణ్యమైనా విద్యను అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్‌వి.రవి సాగర్ అన్నారు. మండలంలోని ఫాతిమాపురం అంగన్‌వాడీ సెంటర్, నగర పంచాయతీలోని ఉర్దూ పాఠశాలను ఆయన పరిశీలించారు. ఫాతిమాపురం అంగన్‌వాడీ సెంటర్‌లో నెల రోజులుగా పాలు రావడం లేదని అంగన్‌వాడీలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ దృష్టిలో పెట్టి ఈ సమస్య పరిష్కరిస్తామని డిఇఒ తెలిపారు. అనంతరం ఉర్దూ పాఠశాల నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని, మెరుగైన విద్యతో పాటు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ రామరావు పాల్గొన్నారు.

పారిశుధ్య పరిస్థితులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

నగర పంచాయతీ అభివృద్ధిపై దృష్టి పెట్టండి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నగర పంచాయతీ అభివృద్ధిపై అధికారులు దృష్టి పెట్టాలని నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ సూచించారు. చింతలపూడి పట్టణంలో పారిశుధ్య పరిస్థితులను ఆయన శుక్రవారం పరిశీలించారు. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. పట్టణంలో ఉన్న చెరువును బాగుచేయించాలని పాతబస్టాండ్ బస్ స్టేషన్ వద్ద బస్సులు ఆగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పన్ను వసూలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపంచాయతీ కమిషనర్ ఎన్.రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి పటిష్ట చర్యలు

ప్రజాశక్తి - పోలవరం

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆదేశించారు. శుక్రవారం మండల పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, తహశీల్దారు, మండల ప్రజాపరిషత్ అధికారులతో ఫోన్లో మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరారు. అవసరమైన మరమ్మతులు చేయాలని, పనులు సత్వరం పూర్తిచేయాలని, నిర్మాణంలో ఉన్న వాటర్‌ట్యాంకుల పనులు, జలజీవన్ మిషన్ పనులు సత్వరమే పూర్తయ్యే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

మోడీపై బిబిసి డాక్యుమెంటరీ, అదానీ కుంభకోణాలపై

9న వామపక్షాల జిల్లా సదస్సు

ప్రజాశక్తి - ఏలూరు

కేంద్రంలో బిజెపి ప్రభుత్వ, గౌతమ్ అదానీ వంటి కార్పొరేట్ సంస్థల అవినీతి కుంభకోణం, మోడీపై బిబిసి డాక్యుమెంటరీ నివేదికలపై ఏలూరులో వచ్చేనెల తొమ్మిదో తేదీన వామపక్షాల ఆధ్వర్యంలో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీలు తెలిపాయి. శుక్రవారం ఉదయం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో వామపక్ష పార్టీల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కె.మన్నవ కృష్ణచైతన్య, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డివిఎన్‌విడి.ప్రసాద్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు రాయితీలిస్తూ, ప్రజలపై భారాలూ వేస్తుందని విమర్శించారు. దీంతో దేశంలో ప్రజల మధ్య ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయన్నారు. నిరుద్యోగం, పేదరికం విలయతాండవం చేస్తున్నాయని తెలిపారు. బిజెపి ప్రభుత్వం కేవలం కొద్దిమంది కార్పొరేట్ సంస్థల కోసం పని చేస్తోందన్నారు. గుజరాత్‌కు చెందిన అదానీ డొల్ల కంపెనీల కుంభకోణం హిండెన్ బర్గ్ నివేదిక బయట పెట్టిందన్నారు. అంతక ముందు రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు కుంభకోణం వచ్చిందన్నారు. బిజెపి కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చి, ఆ తరువాత ఆ సంస్థల నుండి ఎలక్ట్రోరల్ బాండ్ల ద్వారా నిధులు పొందుతుందన్నారు. అలా నిధులు రూ.వేల కోట్లు ఖర్చు చేసి ఆయా రాష్ట్రాల్లో ప్రభుత్వాలను అస్థిరపర్చడానికి, కూలదోయడానికి ఉపయోగిస్తున్నాయని విమర్శించారు. దేశంలో ఆయా రాష్ట్రాల్లో మతోన్మాద శక్తులను పెంచి పోషించడానికి ఉపయోగిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలకు బిజెపి అవినీతి అక్రమాల గురించి తెలిపేందుకు ఏలూరులో జిల్లా సదస్సు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్యవక్తగా మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్.శర్మ హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ నాయకులు బండి వెంకటేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పళ్లెం కిషోర్, సిపిఐ మహిళా నాయకులు కొండా బేబీ, సిపిఐ ఎంఎల్‌న్యూ డెమోక్రసీ నాయకులు కాకర్ల అప్పారావు పాల్గొన్నారు.

పొగాకు పందిళ్లు వేస్తున్న కూలీలు

ఆశాజనకంగా నాటు పొగాకు దిగుబడి

చేతికొచ్చిన పంట
ముమ్మరంగా పొగాకు పందిళ్ల ఏర్పాటు
రూ.55వేలు గిట్టుబాటు ధర కల్పించాలి : రైతుల డిమాండ్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని నాటు పొగాకు పంట కోతకు వచ్చింది. పొగాకును నరికి పందిరి కట్టే ప్రక్రియ వేగంగా సాగుతుంది. మండలంలో బుసరాజుపల్లి, కంగాలవారిగూడెం, కొమ్ముగుడెం, నూతిరామన్నపాలెం, ఇప్పాలపాడు, వీరన్నపాలెం, సీతప్పగూడెం, అంతర్వేదిగూడెం గ్రామాలకు చెందిన రైతులు 414 ఎకరాల్లో నాటు పొగాకును సాగుచేశారు. ఈ పంట చేతికిరావడంతో కోతలో భాగంగా ముందుగా నాటుపొగాకు మొక్కలను నరికి పందిరి కడతారు. పొగాకు ఆరిన తరువాత కావును వేస్తారు. కావులలో పొగాకు బాగా మాగిన తర్వాత కూలీలతో రెలిపించి మళ్లీ పొగాకును కావు వేస్తారు. ఈ విధంగా చేసిన తర్వాత పుట్టిలలో పొగాకును అమ్ముతారు. ఈ విధంగా నాటు పొగాకును పండించే రైతులు ఈ ప్రక్రియలో పంటను వేయడానికి సుమారు ఎకరాకు రూ.80 వేలు ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు.

ప్రస్తుతం అవుతున్న పెట్టుబడి ఖర్చులకు రైతుకు లాభసాటిగా ఉండాలంటే సుమారు పుట్టి ధర రూ.55 వేలుపైన ఉంటేకానీ రైతు లాభం రాదని తెలిపారు. ప్రస్తుతం మండలంలో అన్నిచోట్లా నాటు పొగాకు పంట ఆశాజనకంగానే ఉందని రైతులు అంటున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పంటకు గిట్టుబాటు ధర ఉంటే కష్టాలు తీరుతాయని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు.

రూ.55 వేలు ఉంటేనే గిట్టుబాటు
కారం ఆనంద్, పొగాకు రైతు, వీరన్నపాలెం

నాటు పొగాకు సాగుకు పెట్టుబడులు అధికంగా పెట్టాలి. ఈ ఖర్చుకు తగ్గట్టుగానే గిట్టుబాటు ధర రూ.55 వేలు కంటే ఎక్కువ ఉండాలి. అలా అయితేనే మాకు లాభం వస్తుంది. ప్రభుత్వం ఈ నాటు పొగాకు పంటకు మంచి ధరను ఇవ్వాలి.

ఏడు నామినేషన్లు ఓకే

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎంఎల్‌సి స్థానాలకు సంబంధించిన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పూర్తయ్యింది. శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు నామినేషన్ల పరిశీలన ప్రక్రియ నిర్వహించారు. మొత్తం ఎనిమిది మంది అభ్యర్థులు 15 నామినేషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. నామినేషన్ల పరిశీలన అనంతరం ఏడు నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు గుర్తించారు. వైసిపి నుండి కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని తేల్చారు.

నల్లి రాజేష్ నామినేషన్ తిరస్కరణ

వంకా రాజకుమారి, వీరవల్లి చంద్రశేఖర్, దేవరపల్లి ఆదాం, గోరింక దాసు, పసల వెంకటాచలం నామినేషన్లను ఇండిపెండెంట్ అభ్యర్థుల నామినేషన్లుగా గుర్తించి పరిగణనలోకి తీసుకున్నట్లు అరుణ్‌బాబు తెలిపారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన నల్లి రాజేష్ మూడుసెట్ల నామినేషన్లు నిబంధనల మేరకు లేకపోవడంతో తిరస్కరించినట్లు అరుణ్‌బాబు చెప్పారు.

గిరిజన హక్కులకు రక్షణ

ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ కె.రవిబాబు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మాట్లాడుతున్న రవిబాబు

గిరిజన హక్కులకు రక్షణగా ఉంటామని ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కె.రవిబాబు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని ఓగిరాల తండాలో ఎస్‌టి కమిషన్ ఏడు తండాల గిరిజనులతో, ప్రజలతో ముఖాముఖి నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అధికార పార్టీ యంత్రాంగం గిరిజనులకు చేరేలా చర్యలు తీసుకోవడంలో పూర్తిఅలసత్వం వహిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఈ నాలుగేళ్ల కాలంలో గిరిజన అభివృద్ధికి ఎన్నో చట్టాలు తీసుకొచ్చిందన్నారు. విద్య, ఉద్యోగం, వైద్యం, ఆర్థిక, అంశాలలో గిరిజనుల అభివృద్ధే ధ్యేయంగా పెట్టుకుందన్నారు. రాష్ట్రంలో నూజివీడు మండలంతో పాటు పలుచోట్ల రెవెన్యూ, అటవీశాఖ అధికారులు సమన్వయ లోపంతో గిరిజనులకు అన్యాయం జరుగుతుందన్నారు. గిరిజనులు సాగు చేసుకునే భూమి వారికే చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, భోగిరాల తండా సర్పంచ్ బూక్యా రాణి, ఎంపిటిసి దుర్గమ్మ, అధికారులు పాల్గొన్నారు.

నూజివీడు: నూజివీడు నియోజకవర్గంలో ఎపి గిరిజన సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కె.రవిబాబు శుక్రవారం పర్యటించారు. నూజివీడు ప్రాంతంలోని తండాలలో ఉన్న గిరిజనుల సమస్యలను తెలుసుకుని ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగపరంగా ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామన్నారు. అటవీ భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులకు అటవీశాఖ అధికారులు భూమి నుండి తొలగించి వాటిని స్వాధీనం చేసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజనులకు న్యాయం జరిగేలా చూస్తానని చెప్పారు. గిరిజన సమస్యలు తెలుసుకునేందుకు వస్తే జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ఎవరూ రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సోషల్ వెల్ఫేర్, ఎపి ట్రాన్స్‌కో, ఎడ్యుకేషన్, ట్రైబల్ వెల్ఫేర్, ఆర్‌డబ్ల్యుఎస్, హౌసింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలంటూ కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌ను కోరారు.

పట్టణంలోని శ్రీనివాస మహల్ సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద రవిబాబు అన్నదానం చేశారు. ఉదయగిరి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ ఛైర్మన్ ఉదయగిరి కృపారావు నిరంతరాయంగా కొనసాగిస్తున్న అన్నదానాన్ని రవిబాబు అభినందించారు. స్వయంగా పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృపారావు సేవా దృక్పథం ఎంతో గొప్పదన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - పోలవరం

నవధాన్యాల వాడకంతో అనారోగ్యాలకు చెక్ పెట్టవచ్చని వ్యవసాయ శాఖ మాస్టర్ ట్రైనర్ వారా జ్యోతిర్మయి అన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గూటాల గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన, నవధాన్యాల సాగు, వాడకం వల్ల ప్రయోజనాలు పలు అంశాలపై రైతులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు సుంకర జిబాబు, ఒబిలిశెట్టి ప్రసాద్, సాంబ, అన్నవరం, పాలూరు కృష్ణ ఎల్‌టిలు ఎం.పోశమ్మ, యు.సుబ్బలక్ష్మి, కె.శివనాగమణి, ఎన్.రాజేష్, డి.బాలయోగి, పి.మైథిలి, నిర్మల, వెంకటలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శర్మ పాల్గొన్నారు.

పాఠశాలలో ఎంపిడిఒ తనిఖీలు

ప్రజాశక్తి - చాట్రాయి


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ

మండలంలోని మర్రిబంధం గ్రామంలోని ఎంపిపి పాఠశాలను ఎంపిడిఒ ఎన్.మురళీమోహన్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. పాఠశాలలో విద్యాబోధన, మధ్యాహ్న భోజన కార్యక్రమాలు సంతృప్తికరంగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో రిజిస్టర్లు, పిల్లలకు ఇచ్చే పౌష్టికాహారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.


డ్రైడేపై స్థానికులకు అవగాహన కల్పిస్తున్న వైద్య అధికారులు

గణపవరంలో డ్రై డే

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఒకటో సచివాలయ పరిధిలో ఉన్న దళితపేటలో వైద్య అధికారులు డ్రై డే నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు పి.సంతోష్‌నాయుడు, పి.కిరణ్మయి మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాల్లో మురికి నీరు చెత్తాచెదారాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇళ్ల వద్ద పనికిరాని పాత టైర్లు, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ డబ్బాలు, పూల కుండీలు ఇంటికి దూరంగా ఉంచాలన్నారు. వాటిలో నీరు చేరి నిల్వ ఉండడం వల్ల దోమలు పెరుగుతాయన్నారు. దోమల వల్ల డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి అంటు రోగాలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. దోమలు ఇంట్లోకి చేరకుండా కిటికీలకు, గుమ్మాలకు, దోమతెరలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ జె.విల్సన్‌బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి టిడిపి యువనేత కొడాలి వినోద్ శుక్రవారం అర్థిక సాయం అందించారు. ముదినేపల్లికి చెందిక కత్తుల బాలరత్నం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కొడాలి వినోద్ పార్టీ నేతలతో కలిసి బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించారు. మృతుని ముగ్గురు కుమార్తెల చదువుకు తెలుగుదేశం పార్టీ తరపున సహాయం చేస్తామని తెలిపారు. అనంతరం మృతుని కుటుంబసభ్యులకు తనవంతుగా అర్థిక సాయం అందించారు. ఆయనతో పాటు పెనుమల్లి గ్రామ సర్పంచి జె.వెంకటేశ్వరరావు ఉన్నారు.

ముదినేపల్లిలో నకిలీ నోట్లు చలామణి

ప్రజాశక్తి - ముదినేపల్లి

నకిలీ రూ.200 నోటు

మండల కేంద్రమైన ముదినేపల్లిలో నకిలీ నోట్లు చలామణి జరుగుతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది. నకిలీ నోట్ల చలామణితో పలువురు వ్యాపారులు నష్టపోతున్నట్లు చెబుతున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు వస్తువులు కొనుగోలు చేసి వ్యాపారులకు నకిలీ నోట్లను ఇస్తున్న సంఘటనలు ఇటీవల ముదినేపల్లిలో బాగా ఎక్కువయ్యాయి. పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేసుల విచారణ పేరుతో తిరగాల్సి వస్తుందని ఎవరూ ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడంలేదు. సంక్రాంతి పండుగ సమయంలో నిర్వహించిన కోడిపందెలు, గూండాటల్లో కూడా వీటి మారకం జరిగినట్లు కొందరు చెబుతున్నారు. రూ.500, రూ.200, రూ.100, రూ.50 నకిలీ నోట్లు ముదినేపల్లి మండలంలో చలామణి అవుతున్నట్లు వ్యాపారులు పలువురు చెబుతున్నారు. ముఖ్యంగా తెల్లవారుజామున వీటి చలామణి ఎక్కువగా జరుగుతున్నట్లు చెబుతున్నారు. తీరా నోటు నకిలీ అని తెలుసుకుని వ్యాపారులు ఏమి చేయలో తెలియక మిన్నకుండిపోతున్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

క్లాప్ వాహన డ్రైవర్ల వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

స్వచ్ఛభారత్ క్లాప్ వాహన డ్రైవర్ల వేతనాలు పెంచాలని ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ఉపాధ్యక్షులు భజంత్రీ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. డ్రైవర్లను నియమించేటప్పుడు రూ.18,500 వేతనం ఇస్తామని చెప్పి నేడు రూ.12,500 ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వచ్ఛభారత్ వాహన నిర్వహణకు రూ.55 వేలు చెల్లిస్తూ మున్సిపాలిటీ నిధులను కాంట్రాక్టుకు ధారాదత్తం చేయడం వెనుక జరిగిన అవినీతిని స్వతంత్ర దర్యాప్తు సంస్థచే విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్పొరేషన్ మున్సిపాలిటీల్లో, నగర పంచాయతీల్లో, వాహన డ్రైవర్లు విధులకు హాజరవుతున్నారని, వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత, ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో 4975 మంది క్లాప్ వాహన డ్రైవర్లకు జీతాలు సకాలంలో చెల్లించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రైవర్ల పని భద్రత ప్రశ్నార్థకంగా మారిందని ఆరోపించారు. వాహన డ్రైవర్లకు ఇఎస్‌ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతినెలా జీతాలు చెల్లించేలా రెడ్డి కో ఏజెన్సీ చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడతామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు డి.నాగబాబు, కిలారి వెంకన్న, చోడవరపు హరీష్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

చెరుకు తోట దగ్ధం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని చంద్రమ్మ కాలనీ గ్రామ సమీపంలో రైతు మొడియం రామచంద్రరావుకు చెందిన నాలుగు ఎకరాల చెరుకు తోటక మంటలు చెలరేగాయి. ఇది గమనించిన స్థానికులు అగ్ని మాపక వాహనానికి సమాచారం అందించారు. వాహనం వచ్చే లోపు చెరుకు తోట పూర్తిగా దగ్ధమైంది. రెండు రోజుల్లో కటింగ్‌కి వచ్చిన తోట అగ్ని ప్రమాదంలో దగ్ధమవ్వడంతో తనను ఆదుకోవాలని రైతు బోరున విలపిస్తున్నారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

కైకరం శ్రీమంతుడు సనపల రామకృష్ణ

రూ.30 లక్షలతో జెడ్‌పి ఉన్నత పాఠశాలలో డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు

కంప్యూటర్ క్లాసు

ప్రజాశక్తి - ఉంగుటూరు

తాను పుట్టి పెరిగిన ఊరులోనే ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత విద్యను చదివారు. కృషి, పట్టుదలతో అంచలంచలుగా ఎదిగి ఉద్యోగ, వ్యాపారాల్లో అమెరికాలో స్థిరపడ్డారు. అనంతరం అక్కడితో ఆగిపోకుండా తాను చిన్నతనంలో విద్యను అభ్యసించిన పాఠశాలలో అతనితో పాటు అతని మిత్రులు, సంస్థల సాయంతో రూ.30 లక్షలతో డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్, కంప్యూటర్ తరగతులను ఏర్పాటు చేసి గ్రామీణ విదార్థులకు సైతం టెక్నో పాఠాలు నేర్పించాలనే ఆశయాన్ని నెరవేరుస్తూ ఆదర్శంగా నిలిచారు సనపల రామకృష్ణ, భానుమతి దంపతులు.

రామకృష్ణ నేపథ్యం

ఉంగుటూరు మండలం కైకరానికి చెందిన సామాన్య రైతు కుటుంబానికి చెందిన సనపల రామకృష్ణ స్వగ్రామంలోనే ప్రాథమిక విద్య, అనంతరం స్థానిక హైస్కూల్‌లో 1971లో పదో తరగతి వరకు చదివారు. నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఆ సంవత్సరమే ప్రారంభమైన ఇంటర్మీడియట్ మొదటి బ్యాచ్‌లో రామకృష్ణ చదువుకున్నారు. ఆనాటి ఇంటర్‌లో ఉభయ ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నత ర్యాంకు సాధించడం విశేషం. ఇంటర్ తరువాత కాకినాడలో సాంకేతిక విద్యను చదివి గోల్డ్‌మెడల్ సాధించి ఢిల్లీలో ఐఐటిలో ఎంటెక్ చేసి అమెరికాలో వ్యాపారస్తునిగా స్థిరపడ్డారు.

సొంత ఊరిపై మమకారంతోనే సేవా కార్యక్రమాలు

రామకృష్ణ, భానుమతి దంపతులు అమెరికాలో వారి మిత్ర బృందంలో ఏర్పాటు చేసిన కీట్స్ సంస్థ ద్వారా రామకృష్ణ తన సొంత నిధులు రూ.30 లక్షల విలువైన 30 కంప్యూటర్లు, ఫర్నీచర్లు, ఐదు డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్, టీవీలు, ఐదు ల్యాప్ టాప్‌లు కైకరం పాఠశాలకు కొన్ని నెలల క్రితం అందించారు. వాటి సాయంతో విద్యార్థులకు కంప్యూటర్, బైజూస్ డిజిటల్ పాఠ్యాంశాలను అందిస్తున్నారు.

విద్యార్థులతో ముచ్చటిస్తున్న రామకృష్ణ దంపతులు

కైకరం పాఠశాలను సందర్శించిన రామకృష్ణ దంపతులు

అమెరికా నుంచి సొంతూరు కైకరానికి రామకృష్ణ ఆయన భార్య భానుమతి, మిత్రులు ఈ నెల 23న వచ్చారు. తామిచ్చిన కంప్యూటర్లు, డిజిటల్ తరగతుల పనితీరు, విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ తాను కిరోసిన్ చిమ్ని దీపాల వెలుతురులో చదువుకున్నామని గుర్తు చేసుకున్నారు. అప్పటి, ఇప్పటి పరిస్థితులకు చాలా మార్పులు వచ్చాయని మీరంతా బాగా కష్టపడి తాము ఇచ్చిన కంప్యూటర్ల సాయంతో నాణ్యమైన విద్యను అభ్యసించి ఉన్నత స్థానానికి చేరుకోవాలని అభిలషించారు.

ఆదర్శప్రాయులు

పుట్టిన ఊరిపై మమకారంతో తమ పాఠశాలకు రూ.లక్షలాది విలువైన కంప్యూటర్ల సాయంతో నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేసిన సనపల రామకృష్ణ దంపతులు ఆదర్శప్రాయులని పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు చేబ్రోలు శ్రీనివాసకుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

ఘన సత్కారం

సత్కారం పొందుతన్న రామకృష్ణ దంపతులు

రూ.30 లక్షల వితరణతో పేద విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించేందుకు సాయం చేసిన రామకృష్ణ భానుమతి దంపతులను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సీనియర్ న్యాయవాది, కైకరానికి చెందిన కూన కృష్ణారావు, రామకృష్ణ మిత్రులు గుండెపల్లి అప్పారావు, ఎల్లంకి జయదేవ్, పుప్పాల గోపీ, కూన అప్పారావు పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ ఐపిటివి సర్వీస్ ప్రారంభం

ఆవిష్కరించిన ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ

మాట్లాడుతున్న ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో తొలిసారిగా భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బిఎస్ఎన్ఎల్) ఐపిటివి సర్వీస్ ప్రారంభించడం అభినందనీయమని జిల్లా ఎస్‌పి రాహుల్ దేవ్ శర్మ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం బిఎస్ఎన్ఎల్, సిటీ ఆన్‌లైన్ మీడియా ప్రయివేట్ లిమిటెడ్ సంయుక్తంగా ఐపిటివి సర్వీస్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌పి రాహుల్ దేవ్ శర్మ పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఐపిటివి సర్వీస్‌ను ఎస్‌పి రాహుల్ దేవ్ శర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంటర్‌టైన్‌మెంట్ అనేది జీవితంలో ఒక భాగమన్నారు. ప్రభుత్వ రంగానికి చెందిన టెలికం కంపెనీ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బిఎస్ఎన్ఎల్) కస్టమర్లకు సిటీ ఆన్‌లైన్ మీడియా ప్రయివేట్ లిమిటెడ్‌తో భాగస్వామ్యంగా ఏర్పడి ఇంటర్నెట్ ప్రోటోకాల్ టెలివిజన్ (ఐపిటివి) సర్వీసులు అందించడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం బిఎస్ఎన్ఎల్ ఫైబర్ బ్రాడ్‌బాండ్ కస్టమర్లకు ఈ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. సిటీ ఆన్‌లైన్ మీడియాకు చెందిన ఉల్కా టివి బ్రాండ్ కింద ఈ సర్వీసులు అందుబాటులోకి బిఎస్ఎన్ఎల్ తీసుకొచ్చిందన్నారు. బిఎస్ఎన్ఎల్ బ్రాండ్ బాండ్ కనెక్షన్‌తో పాటు ఈ సేవలు పొందొవచ్చున్నారు. దీని వల్ల కస్టమర్లు టివికి, బ్రాడ్‌బాండ్‌కు విడివిడిగా కనెక్షన్లు తీసుకోవాల్సిన పని లేదన్నారు. అనంతరం బిఎస్ఎన్ఎల్ ఏలూరు బిజినెస్ ఏరియా జిఎంఎల్ శ్రీను మాట్లాడుతూ ఉమ్మడి పచ్చిమగోదావరి జిల్లాల్లో ఈ సర్వీస్ అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. వాటిలో నాలుగు ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయ న్నారు. స్టాండర్డ్ డెఫినేషన్ బేసిక్, స్టాండర్డ్ డెఫినేషన్ బొనాంజా, హై డెఫినేషన్ బేసిక్, హై డెఫినేషన్ బొనాంజా అనేవి ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయన్నారు. వీటి ధర వరుసగా రూ.229, రూ.259, రూ.279, రూ.329గా ఉందన్నారు. డిజిటల్ టెలివిజన్ ఛానల్స్‌పై రోజురోజుకు పెరుగుతున్న ఆదరణకు అనుగుణంగా ఉల్కా టివి బ్రాండ్ కింద ఈ సర్వీసులు అందుబాటులోకి బిఎస్ఎన్ఎల్ తీసుకొచ్చిందన్నారు. బిఎస్ఎన్ఎల్ ఏలూరు బిజినెస్ ఏరియాలో 16 వేల ఫైబర్ బ్రాడ్‌బాండ్ వినియోగదారులు ఉన్నారన్నారు. ఈ ఐపిటివిలో 4కె టెక్నాలజీ కలిగి ఉండడం వల్ల అత్యుత్తమ క్వాలిటీతో వీక్షించవచ్చునన్నారు. అనంతరం ఉల్కా టివి డైరెక్టర్ రాఘవరావు మాట్లాడుతూ ఉల్కా టివి అనేది లేటెస్ట్ 4కె టెక్నాలజీ హై ఎఫిసియెన్సీ వీడియో కోడింగ్ ద్వారా కస్టమర్లకు బెస్ట్ క్వాలిటీ సర్వీసులు అందిస్తోందన్నారు. బిఎస్ఎన్ఎల్ బ్రాడ్‌బాండ్ కస్టమర్లు ఇకపై ఐపిటివి సర్వీసులు పొందొచ్చున్నారు. ఐపిటివి సర్వీసులు 4కె టెక్నాలజీతో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ సేవలు శాటిలైట్ సిగ్నల్స్ ద్వారా కాకుండా ఫైబర్ ద్వారా లభిస్తాయన్నారు. టివి ఛానల్స్‌ను టివిలోనూ, స్మార్ట్‌ఫోన్‌లోనూ రెండింటిలోనూ చూడొచ్చ న్నారు. ఉల్కా టివి ప్రత్యేకమైన యాప్ కూడా ఉందన్నారు. కస్టమర్లు ఒటిటి అప్లికేషన్స్, లైవ్ శాటిలైట్ టివి ఛానల్స్ చూడొచ్చన్నారు. ఈ సమావేశంలో డిజిఎం సోమయాజులు, ఐఎఫ్ఎ శ్రీరామ్మూర్తి, బిఎస్ఎన్ఎల్ పిఆర్ఒ మోహన్ కృష్ణ, బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సైన్స్‌పై పరిపూర్ణ అవగాహన అవసరం

ప్రజాశక్తి - మండవల్లి

సైన్స్, వ్యాసరచన పోటీల వల్ల విద్యార్థుల్లో సైన్స్‌పై పరిపూర్ణ అవగాహన పెరిగి భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ఎంతగానో దోహదపడతాయని శాస్త్రవేత్త సుధామ ఫౌండేషన్ అధినేత సుధాబత్తుల విజయకుమార్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామాల అభివృద్ధిలో సైన్స్ ప్రాముఖ్యత అంశంపై మండల స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ వ్యాసరచన పోటీల్లో మండవల్లి, లింగాల, కానుకల్లు, పుట్లచెరువు, ఇంగిలం, పాకలంక, లోకుమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన సుమారు 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు 28న నిర్వహించే జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సుధామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బహుమతులను అందించనున్నట్లు విజయకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్‌ఎస్.భాస్కరరావు, టి.అప్పారావు, మండవల్లి, కానుకల్లు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జి.వెంకటేశ్వర్లు, వై.మాధవకుమార్, నాగేశ్వరరావు, ఎస్.రాధ, ఆర్‌విఎల్.నరసిం హరావు, ఈశ్వరరావు, నాగ సుబ్బారావు, రఘురాం, రిటైర్డ్ ఉపాధ్యాయులు కె.సూర్యరావు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

దేవస్థానం ఛైర్మన్ పదవికి సీక్రెట్ ఓటింగ్

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు చల్లాలమ్మ దేవస్థానం పాలక మండలి ఛైర్మన్ కోసం అధికార పార్టీకి చెందిన ఇరువురు నాయకులు పోటీ పడుతున్నారు. ఈక్రమంలో శుక్రవారం వైకాపాకు చెందిన పలువురు కార్యకర్తలు, నాయకులు, ఎంపిటిసి సభ్యులు, పార్టీ అనుబంధ కమిటీ అధ్యక్షుల సమ క్షంలో సమావేశం అయ్యారు. ఆ గ్రామానికి చెందిన వైకాపా నాయకులు సీరెడ్డి శ్రీనివాసరావు, దూసనపూడి లక్ష్మీనారాయణ ఛైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. ఈ క్రమంలో సీక్రెట్ బ్యాలెట్ ఓటింగ్‌ను ఎంపిటిసి సభ్యులు డాక్టర్ పెనుగొండ బాలకృష్ణ పర్యవేక్షణలో నిర్వహించారు. 47 మంది కార్యకర్తలు, నాయకులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. సీరెడ్డి శ్రీనివాసరావుకు అనుకూలంగా 27, దూసనపూడి లక్ష్మీనారాయణకు అనుకూలంగా 19 ఓట్లు రాగా ఒక ఓటు చెల్లలేదని ఎంపిటిసి సభ్యులు తెలిపారు. ఓటింగ్ విషయాన్ని ఎంఎల్ఎ వాసుబాబు దృష్టికి తీసుకెళ్లామని, ఛైర్మన్ ఎవరనేది ఆయనే నిర్ణయించాల్సి ఉందని చెప్పారు. కాగా సీరెడ్డి శ్రీనివాసరావును పలువురు పూలదండలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో వీవర్స్ విభాగం జిల్లా అధ్యక్షులు దొంతంశెట్టి సత్యనారాయణ, ఎంపిటిసి-2 సభ్యులు సందక రాంబాబు, ఎఎంసి మాజీ ఛైర్మన్ కొండ్రెడ్డి సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జిల్లాలో పెద్ద ఎత్తున పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించేందుకు ఐదు ఎంఎస్ఎంఇ క్లస్టర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పరిశ్రమల శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా పారిశ్రామిక ఉత్పత్తుల ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎస్ఎంఇ క్లస్టర్ల ఏర్పాటుకు సంబంధించి గతంలో సూచించిన విధంగా ఐదు క్లస్టర్ల ఏర్పాటుకు డిఆర్‌డిఎ, తదితర శాఖలతో సమన్వయం చేసుకుని వచ్చే సమావేశం నాటికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న పెద్ద లే అవుట్‌లలో అనువైన స్థలాలను గుర్తించి గార్మెంట్ తదితర ఉత్పత్తిదారులను సమన్వయం చేసుకుని ముడిసరకు, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించే రీతిలో కాటేజ్ ఇండస్ట్రీస్‌ను ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు.

ఇదే సమయంలో కార్మికులకు అవసరమైన నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను స్కిల్ డెవలప్ మెంట్ సంస్థ ద్వారా అందించాలని సూచించారు. ఎంఎస్ఎంఇలను ప్రోత్సహించేందుకు అందిస్తున్న రుణ సదుపాయంతో పెద్ద తరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యతిచ్చేలా బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ పరిశ్రమల ఏర్పాటుకు సింగిల్ డెస్క్‌కు అందిన దరఖాస్తులు నిర్దేశించిన కాల వ్యవధిలో పరిష్కరించాలన్నారు. వెమ్ టెక్నాలజీస్ నుంచి స్వాధీనం చేసుకున్న పెదపాడు మండలం వట్లూరు, భోగాపురం గ్రామాల్లోని 350 ఎకరాల స్థలంలోని 25 ఎకరాల్లో ఎంఎస్ఎంఇ ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని పరిశ్రమల శాఖను ఆదేశించారు. 2022-23లో సింగిల్ డెస్క్ పథకం ద్వారా ఇప్పటి వరకూ 244 దరఖాస్తులు రాగా వాటిలో 230 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేశామన్నారు. జిల్లాలో నిర్వహించబడిన పరిశ్రమల ఇడిపి ప్రోగ్రాంలలో హాజరైన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు చేయూతనిచ్చి వారిచే పరిశ్రమలు నెలకొల్పేలా కృషి చేయాలని పరిశ్రమలశాఖ అధికారులను ఆదేశించారు. ఐడిపి 2020-23, తదితర పథకాల ద్వారా 20 యూనిట్లకు ప్రతిపాధనలు రాగా వాటికి వివిధ రాయితీల కింద రూ.2.77 కోట్ల మంజూరుకు సమావేశం ఆమోదం తెలిపింది. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పి.ఏసుదాసు, రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ జోనల్ మేనేజర్ కృష్ణ ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్ సుమధురవాణి, జిల్లా పంచాయతీ అధికారి జివికె. మల్లిఖార్జున, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ వెంకటేశ్వరరావు, జాయింట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ టాక్స్ పి.జగదీశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎ.శ్రీనివాస్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ బ్రాంచ్ మేనేజర్ శ్రీనాథ్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కృషి : డిఆర్‌డిఎ పీడీ

ప్రజాశక్తి - దెందులూరు

మహిళా సాధికారత కోసం, ఆర్థిక పురోభివృద్ధికి అధికారులు కలిసికట్టుగా పనిచేయాలని డిఆర్‌డిఎ పీడీ విజయరాజు కోరారు. శుక్రవారం ఎపిఒ కార్యాలయంలో ఈ మేరకు ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మండలంలోని అన్ని స్వయం సహాయక సంఘాల ఆర్థిక పురోభివృద్ధికి మరిన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీ రుణాలు సక్రమంగా అమలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ, ఎపిడి, అధికారులు పాల్గొన్నారు.


మహిళలతో మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పీడీ

దోమల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

పెనుముప్పుగా మారిన దోమల నిర్మూలనకు ప్రజలు సహకరించాలని జిల్లా మలేరియా నియంత్రణ అధికారి పిఎస్ఎస్.ప్రసాద్ సూచించారు. ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా ఏలూరు సత్రంపాడు ఎంఆర్‌సి కాలనీలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ దోమకాటు చాలా ప్రమాదకరమని, దోమ కుట్టడం వల్ల డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తాయని వివరించారు. దోమల నిర్మూలన ఆవశ్యకత ఎంతైనా ఉందని, దీనికి పరిసర పరిశుభ్రత ఆచరించడమే ఉత్తమమని సూచించారు. డెంగీ, మలేరియా కారక దోమలు మన గృహాల్లో, గృహ బయట ఉండే మంచినీళ్ల తొట్టెలు, డ్రమ్ములు, పూల కుండీలు, ఫ్లవర్ వాజులు, రుబ్బురోలు, ఫ్రిడ్జ్ వెనుక, పాత టైర్లు, వాడేసిన కొబ్బరి బోండాలు, ప్లాస్టిక్ వస్తువులు తదితర నీటి నిల్వప్రాంతాల్లో దోమలు ఆవాసాలు ఏర్పరచుకుంటాయని తెలిపారు. ప్రజలు వారానికి ఒకసారి నీటి నిల్వ ప్రాంతాలను పరిశుభ్రపరుచుకుని ఆరబెట్టుకోవాలని సూచించారు. అసిస్టెంట్ మలేరియా నివారణ అధికారి గోవిందరావు మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కువగా దోమ కుట్టడం ద్వారా వచ్చే వ్యాధులైన డెంగీ, మలేరియా, ఇతర ప్రాణాతాకవ్యాధులతో బాధపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఇఒ వెంకటరాజు, నాగదుర్గ హెల్త్ అసిస్టెంట్స్ శ్రీనివాస్, రాజేంద్ర, భిక్షాలు, లక్ష్మీ కుమారి, ఆశా కార్యకర్తలు సుజాత, ప్రమీల, విజయలక్ష్మి వాలంటీర్లు పాల్గొన్నారు.

పనులు చేయిస్తున్న సర్పంచి

నారాయణపురంలో వీధి దీపాలు ఏర్పాటు

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురంలో అపార్ట్‌మెంట్స్ రోడ్డులో వీధి దీపాలు ఏర్పాటు చేసినట్లు సర్పంచి దిడ్ల అలకనంద తెలిపారు. వీధి దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు పలుమార్లు పంచాయతీకి అర్జీలు పెట్టుకున్న నేపథ్యంలో పంచాయతీ నిధులతో విద్యుత్ తీగలు బిగించి లైట్స్ బిగించామని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది సేవలందించారన్నారు. వీధి దీపాలు ఏర్పాటుపై అపార్ట్‌మెంట్ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రానున్న వేసవిలో నీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఎంఎల్ఎ తెల్లం బాలరాజు ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. మండలంలో ఎక్కడైనా ఏమైనా మరమ్మతులు చేయాల్సిన పనులు ఉంటే వెంటనే చేయాలని సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంకులను, జల జీవన్ మిషన్ పనులను సత్వరమే పూర్తయ్యే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. సత్యసాయి నీటి పంపిణీ పథకాన్ని పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

రైతు సంఘం జిల్లా అధ్యక్షులుగా వాసిరెడ్డి మధు

ప్రజాశక్తి - టి.నరసాపురం

వాసిరెడ్డి మధు

రైతు సంఘం జిల్లా అధ్యక్షులుగా మండలంలోని బంధంచర్ల గ్రామానికి చెందిన వైసిపి నాయకులు, కె.జగ్గవరం సహకార సంఘ చైర్‌పర్సన్ వాసిరెడ్డి మధు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మధు శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధాల అధ్యక్షుల ఎంపికలో భాగంగా ఏలూరులో జరిగిన విభాగాల సమావేశంలో వైసిపి మండల యూత్ ప్రెసిడెంట్, పోలవరం నియోజకవర్గ భూత్ కన్వీనర్, కె.జగ్గవరం సహకార సంఘ చైర్‌పర్సన్‌గా విధులు నిర్వహిస్తున్న తన సేవలు గుర్తించిన అధిష్టానం రైతు సంఘం అధ్యక్షులుగా నియమించిందని చెప్పారు. తనపై నమ్మకంతో అధ్యక్ష పదవి కేటాయించిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి, సహకరించిన మంత్రి చెవిరెడ్డి భాస్కరరెడ్డికి, ఎంపి కోటగిరి శ్రీధర్‌కు, ఎంఎల్ఎ తెల్లం బాలరాజుకు, మండలంలోని నాయకులందరికి ధన్యవాదాలు తెలిపారు. రైతుసంఘం అధ్యక్షులుగా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఆయనకు మండలంలో పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.

సరోజారెడ్డికి మాతంగి విజయరాజు స్మారక అవార్డు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక ప్రతిభ పాఠశాల ప్రిన్సిపల్ కె.సరోజారెడ్డికి మాతంగి విజయరాజు స్మారక అవార్డు లభించింది. శుక్రవారం చైతన్య కళా వేదిక జంగారెడ్డిగూడెం వారు ఎంబి సోషల్‌క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం పట్టణంలోని వివిధ రంగాల్లో విశేష కృషి కనబరుస్తున్న కొందరు ప్రముఖులకు విశేష సేవాపురస్కారలతో సత్కరించారు. ఈ క్రమంలో కవితలు, రచనలు, సేవా కార్యక్రమాల్లో ప్రతిభ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ కాసర లక్ష్మీసరోజారెడ్డికి స్మారక అవార్డును అందజేశారు. పట్టణ ప్రముఖులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

'ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధం'

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉన్నామని టిడిపి రాష్ట్ర కార్యదర్శి దాసరి శ్యామ్‌చంద్రశేషు తెలిపారు. శుక్రవారం ఏలూరులో సమావేశానికి హాజరైన చంద్రబాబుకు శ్యామ్‌చంద్రశేషు పుష్ప గుచ్ఛంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తమ అధినేత చంద్రబాబు సూచించిన విధంగా ఎన్నికలు ఎప్పుడు వచ్చినా టిడిపి గెలుపే లక్ష్యంగా, మరింత సమర్థవంతంగా పనిచేస్తామని చెప్పారు.


పిల్లల భోజనం పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ

అవకతవకలు లేకుండా చూడాలి

ప్రజాశక్తి - ముసునూరు

మధ్యాహ్న భోజన పథకంలో ఏలాంటి ఆవకతవకలూ జరగకుండా చూడాలని జిల్లా వైద్యాధికారి డి.ఆశ అన్నారు. ముసునూరు మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆమె శుక్రవారం తనిఖీలు చేపట్టారు. రికార్డులను పరిశీలించారు.